సత్యవేడులో గంగ జాతర వైభోగం

సత్యవేడులో గంగమ్మ జాతర సందడి మొదలైంది. తిరుపతి తాతయ్య గుంట గంగ జాతర తరువాత ఇక్కడి జాతరకు అంతటి ప్రాచుర్యం ఉంది. 110 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. బుధవారం రాత్రి చాకలి వారి ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరి గురువారం తెల్లవారు జామున నడివీధి గంగమ్మ పర్ణశాలలో అమ్మవారు కొలువుదీరనున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సత్యవేడుకు చేరుకోవడం ఆనవాయితీ. పర్ణశాల వద్ద విద్యుద్దీపాలంకరణలు, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- నేడు, రేపు జాతర
- నడివీధి గంగమ్మ ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు

సత్యవేడు: ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు గంగజాతరకు సిద్ధమైంది. గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలో నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి 9 గంటలకుపైగా గ్రామ చాకలి ఇంట గంగమ్మ రూపాన్ని బంక



అలంకరణ ఆభరణాలు సిద్ధం



గుడి వద్ద చలువ పందిళ్లు

మట్టితో కుమ్మరి ప్రత్యేకంగా మహిషాసుర మర్ధినిగా విశేషపూల అలకరణ చేస్తారు. తప్పెట్లు, వాయిద్యాల హోరు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ రజక కులస్తులు గాంధీరోడ్డు, నేతాజీరోడ్డు, పల్లపు వీధి, జయరాంబత్తుడు వీధిల్లో అమ్మవారిని ఉరేగిస్తారు. భక్తులు కర్పూర హారతులు, మొక్కులు చెల్లిస్తారు. గండుదీపం మొక్కు చెల్లించే భక్తులు అమ్మవారి వెంట నడుస్తారు. గురువారం తెల్లవారు జామున గాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన పర్ణశాలలో అమ్మవారిని కొలువుదీర్చనున్నారు. సంప్రదాయ పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

పంటలు బాగా పండుతాయి..

110 ఏళ్లకు పైగా సత్యవేడులో గంగమ్మ రూపాన్ని బంకమట్టితో గ్రామ కుమ్మరి ప్రత్యేకంగా తయారు చేయడం ఆనవాయితీ. మహిషామర్ధినిగా అలంకరణ చేస్తారు. ఏటా జాతర నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయనేది ఇక్కడివారి విశ్వాసం. నడివీధి గంగమ్మకు పర్ణశాలను వేపాకుతో నిర్మిస్తారు. జాతర పూర్తయిన వెంటనే పర్ణశాలను తొలగిస్తారు. రైతులు పర్ణశాలకు వాడిన వేపాకును తమ పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడం వల్ల చీడపీడలు తొలగిపోతాయనేది రైతుల నమ్మకం.



అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్

వాహనాల రాకపోకలు మళ్లింపు

గంగజాతర సందర్భంగా పట్టణంలో ప్రధాన రహదారికి గాంధీరోడ్డుపై రాకపోకలు పూర్తిగా కట్టడి చేశారు. చెన్నై వైపు వేళ్లే వాహనాలను బస్టాండ్ నుంచి పల్లపు వీధి మీదుగా, అటు నుంచి వచ్చే వాహనాలను ఎస్సీ కాలనీ తెలుగుగంగ కాలువ మీదుగా బస్టాండుకు చేరుకునేలా దారి మళ్లించారు.

పకడ్బందీ చర్యలు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు సీఐ దివాకర్ రెడ్డి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముగ్గురు సీఐలు, తొమ్మిదిమంది ఎస్‌లు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోం గార్డులు మొత్తం కలిపి 140 మందితో బందో బస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అకతాయిల వల్ల ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం వస్తే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. ఎవరైనా అనుమానితులుగా గుర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నాటి శక్తివీడే .. నేటి సత్యవేడు

నియోజక వర్గ కేంద్రంలోని 'గంగజాతర'కు ఓప్రత్యేకత ఉంది. ఇక్కడ జాతరకు ముందు యువత పేరంటాళ్ల వేషధారణలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తుంటారు. ఎన్నో ఏళ్ల కింద మాతంగి రుషి ఈ ప్రాంతంలో ఆశ్రమం ఏర్పాటు చేశారు. ని త్యం శివనామ స్మరణతో గడుపుతుండేవారు. అనతి కాలంలోనే అక్కడికి సమీపంలో ఆయన మాతంగేశ్వరాలయాన్ని నిర్మించారు. ఆశ్రమానికి సమీపంలో ఓ చిన్న గ్రామం ఏర్పడింది. అక్కడి ప్రజల విలాసాలు రోజు రోజుకూ మితిమీరాయి. స్త్రీలు మాతంగి రుషిని తమ కష్టాల తొలగించా లని వేడుకున్నారు. దుష్ట బుద్ధి కలవారిని కట్టడి చేసేందుకు గ్రామ నడిబొడ్డులో శ్రీచక్ర పీఠాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు ప్రారంభించారు. అప్పటి నుంచి పేరంటాళ్ల వేషం వేయడం ఆనవాయితీ. శ్రీచక్ర శక్తి పీఠం వద్ద అమ్మవారి ప్రతిష్ట జరిగిన తర్వాత ఈగ్రామానికి శక్తివీడుగా మాతంగి రుషి నామకరణం చేశారు. ఈపదం తమిళభాషలో నిది. తమిళంలో 'శక్తి' అంటే అమ్మవారు, అని.. వీడు అంటే ఇళ్లు అని అర్థం. అది కాలగమనంలో సత్యవీడుగా మారి నేడు సత్యవేడుగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



హరహరబావి శివాలయం పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా హరహర తీర్థంలో ఉన్న పురాతన శివాలయం, నూతనంగా నిర్మించి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పనసకోనలో వెలసిన హరహరతీర్థంలోని శివాలయం శిథిలావస్థకు చేరుకుంటే, దానిని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించాలని అధికారులకు సూచించారు. పాలక మండలి సమావేశంలో రూ.45లక్షల వ్యయంతో ఇక్కడ స్వామి అమ్మవార్ల నూతన ఆలయ నిర్మాణం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సుదర్శన్‌రెడ్డి, బాలాజీ, కామేశ్వరరావు, కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలు



పరిశీలిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు 7,004 పాఠ్య పుస్తకాలు చేరినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పాఠశాలలు తెరచిన వెంటనే అందజేస్తానన్నారు. ఇప్పటికే నోట్ బుక్స్ పాఠశాలకు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



వెంకటరమణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగార్జున్ చిత్తూరు మెయిన్ బ్రాంచ్‌కి బదిలీపై వెళ్లారు. పీలేరు నుంచి వెంకటరమణ ఇక్కడికి వచ్చారు. ఖాతాదారులకు మెరుగైన బ్యాంకు సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేటి నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్ల

నాగలాపురం: పట్టణంలోని వీకేఎంవీధి శ్రీకావమ్మ, మారయ్య ఆలయ తిరుణాళ్ల బుధవారం ప్రారంభ కానుందని, ఈనెల 31వ తేదీ జరుగుతాయని నిర్వాహకుడు జె.గోవిందుడు తెలిపారు. బుధవారం గణపతి హోమం, 30వ తేదీ రాత్రి కావమ్మ కథ, సారె సమర్పణ, 31వ తేదీ ఉదయం 10 గంటలకు పొంగళ్లు కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు కావమ్మ, మారయ్య ఉత్సవమూర్తుల ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్ల దీవెనలు పొందాలని కోరారు.

11న పానగల్ జాతర చాటింపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో గంగమ్మ జాతరకు జూన్ 11వ తేదీన చాటింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 11న చాటింపు 18న గంగమ్మ నిలుపుదల, 19న గంగమ్మ నిమజ్జనం కార్యక్రమం జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



కాలభైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం శ్రీకాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏకాంత సేవకు ముందుగా ప్రతి మంగళవారం రాత్రి 8–30 గంటల సమయంలో శ్రీకాలభైరవస్వామికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. తొలుత కాలభైరవస్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అభిషేకాలు, ధూప, దీప నైవేద్యాల అనంతరం పంచ హారతులు సమర్పించారు. కాలభైరవస్వామి ఉత్సమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయస్తూపం మీదుగా ప్రదక్షిణగా ఊరేగించి ఆలయంలోకి వేంచేపు చేశారు. భక్తులు దర్శించి తరించారు.

ముత్యాలమ్మకు ఉయ్యాల సేవ



చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారిని ఊరేగించిన అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ సింహాద్రి మనోహర్ పాల్గొన్నారు.

కండలేరులో 6.669 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.669 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.

గంగమ్మకు పొంగళ్లు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు ఎస్సీ కాలనీలో మంగళవారం గంగమ్మకు గ్రామస్తులు పొంగళ్లు నివేదించారు. ఉదయాన్నే అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయం వద్ద అంబళ్లు పోశారు. అంజిమేడు మీదుగా కోబాక, పాతవీరాపురం, మాధవమాల, ఇసుక తాగేలి తదితర గ్రామాల్లో గెరిగి ఊరేగింపు జరిగింది. మహిళలు సాయంత్రం ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.



విశేషాలంకరణలో గంగమ్మ



పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఉపాధి పనుల కూలి రేట్లు పెంచాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న కార్మిక సంఘం నాయకులు

వరదయ్యపాళెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆంబాకం చిన్నిరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మావిళ్లపాడు చెరువులో పనిచేస్తున్న కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడికతీత పనులకు రోజువారీ కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోయినట్లు ఆయన వివరించారు. మండు వేసవిలో పూడికతీత పనులు కష్టతరంగా ఉందని, ఇలాంటి తరుణంలో క్యూబిక్ మీటర్ రేట్లు పెంచాలని కోరారు. పనులు జరిగే ప్రాంతంలో కనీస వసతులు లేవని తెలిపారు. ప్రథమ చికిత్స కిట్లు, చంటి బిడ్డల తల్లులకు నిలువ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మురళి, కార్యదర్శి చంద్ర, మునిసుబ్రమణ్యం, హరిబాబు, హేమంత్, గోపి పాల్గొన్నారు.

కోలాహలం.. పార్వేట ఉత్సవం

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని టీటీడీకి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామ సమీపంలో పాఠశాల ఆవరణలో స్వామివారు వేటకు వెళ్లే ఘట్టాన్ని ప్రధాన అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనాల్లో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



పార్వేటకు ఊరేగింపుగా వెళుతున్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి



ప్రత్యేక అలంకరణలో కరిమాణిక్యస్వామి

మము పాలింపగా వచ్చితివా..

నారాయణవనంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉభయ నాంచారులతో కలసి రథంపై పుర వీధుల్లో విహరించారు. సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ నయనానందకరంగా సాగింది. భక్తుల గోవింద నామ స్మరణతో నారాయణవనం పులకించింది.

- వైభవంగా కల్యాణ వెంకన్న రథోత్సవం
- అశ్వవాహనంపై పురవీధుల్లో విహారం

నారాయణవనం : మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రంగుల వస్త్రాలు, ప్రతిమలతో సుందరంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా విశేషంగా ముస్తాబైన శ్రీస్వామివారు రథ విహారం చేస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 3.45 గంటలకు సుప్రభాతసేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. 5.30 గంటలకు దేవరులతో కలిసి వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంలో రథ మండపానికి వేంచేపు చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవర్లు 7 గంటలకు రథాన్ని అధిరోహించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య వీధుల్లో విహరిస్తూ 11 గంటలకు రథం గంగుంద్ర మండపం వద్దకు చేరుకుంది. మళ్లీ 2 గంటలకు ప్రారంభమై రథం 4 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంది. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఏకాంతంగా స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం దోపోత్సవంలో భాగంగా అశ్వవాహనాన్ని అధిరోహించిన స్వామివారు దక్షిణమాడ వీధికి చేరుకున్నారు. శ్రీపద్మావతీ అమ్మవారి స్వర్ణాభరణాలను అపహరించిన తిరుమంగై ఆళ్వార్‌ను వెంటాడి విడిపించిన ఘట్టం భక్తులను కనువిందు చేసింది.



రథంపై స్వామివారి విహారం

కల్యాణం కమనీయం

రాత్రి 8.30 గంటలకు ఆలయ వాహన మండలంలో కల్యాణ వేంకటేశ్వరస్వామికి శ్రీదేవి, భూదేవి, పద్మావతీ అమ్మవార్లతో ఆర్జిత కల్యాణోత్సవాన్ని వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. తిరుమలతో సహా అన్ని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీదేవి, భూదేవితో మాత్రమే కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. పద్మావతీ అమ్మవారిని శ్రీనివాసుడు వివాహమాడిన క్షేత్రమైన నారాయణవనంలో మాత్రమే ఉభయ దేవేరులతో పాటు పద్మావతీ అమ్మవారితో కల్యాణోత్సవాన్ని నిర్వహించడం విశేషం. అనంతపురం, కడప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన పద్మసాలీలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను టీటీడీ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొని పర్యవేక్షించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ సిబ్బంతో బందోబస్తు చేపట్టారు. ఉత్సవాలలో చివరి రోజైన బుధవారం ఉదయం పద్మసరస్సులో ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు.



అశ్వ వాహనంపై ఊరేగింపు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నకేశవస్వామికి ఏకాంత సేవ



ఏకాంతసేవ నిర్వహిస్తున్న అర్చకులు

గూడూరురూరల్: పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష తులసి అర్చన చేసిన తరువాత సాయంత్రం పలు రకాల పుష్పాలతో అభిషేకం చేశారు. రాత్రి స్వామి వారికి అర్చకులు ఏకాంతసేవను నిర్వహించారు. భక్తులకు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వెంకటగిరిరూరల్: స్థానిక బంగారుపేట బీసీ కాలనీ సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం శ్రీనివాసన్ సేవాసంస్థ, శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీనివాసన్ సేవాసంస్థ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారిని పరీక్షల ద్వారా ఎంపిక చేసి ఉచిత కంటి ఆపరేషన్‌కు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



శ్రీకాళహస్తి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాలయ్య

శ్రీకాళహస్తి: విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకులకు ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ వంట గదులు శుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన కూరగాయలు వినియోగించాలని తెలిపారు. ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ జయరాంనాయుడు, ఉపాధ్యాయులు హేమకుమార్, రమేష్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది లలిత, మాధవయ్య, ప్రశాంత్, సీఆర్‌ఎంటీలు మునిమోహన్, ప్రదీప్‌కుమార్, ధన, శంకరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మండల విద్యాశాఖ అధికారి బాబయ్యా, జనార్దన్‌రాజు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం బాగుంటే పిల్లల అడ్మిషన్లు కూడా పెరుగుతాయని తెలిపారు. తమ వంతు బాధ్యతగా తల్లుల పాత్ర పోషించాలిన సూచించారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో పని చేయాలని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ అంబిక, సీఆర్పీ శివయ్య, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.